www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 8 అక్టోబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-164 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# కూసుకుంట్ల విజయానికి కృషిచేయాలి

- మునుగోడులో కలసి ముందుకు వెళ్లాలి
- బూర, కర్నె ప్రభాకర్‌లకు కెసిఆర్ సూచన
- మునుగోడు గెలుపుపై పార్టీనేతలతో కెటిఆర్ సమీక్ష



**హైదరాబాద్, అక్టోబర్ 7 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్ఎస్ పార్టీ విజయానికి అందరూ కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విజయానికి కృషి చేయాలని టీఆర్ఎస్ మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌కు కేసీఆర్ సూచించారు. భవిష్యత్‌లో జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో నేతలందరికీ అవకాశాలు వస్తాయని సీఎం పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సూచన మేరకు కూసుకుంట్ల గెలుపు కోసం కృషి చేస్తామని నర్సయ్య గౌడ్, ప్రభాకర్ తెలిపారు.మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని టీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉద్యమకారుడిగా పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతూ, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేస్తున్న కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డినే కోరుకుంటూ స్థానిక నాయకులు, కార్యకర్తలు, జిల్లా పార్టీ నాయకత్వం, నియోజకవర్గ ప్రజల అభిప్రాయాలను, సర్వే రిపోర్టలను పరిశీలించిన తర్వాత సీఎం కేసీఆర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి 2003 నుంచి టీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. తెలంగాణలో జరిగిన పలు ఉపఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే 2018లో జరిగిన ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటినుంచి మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. 3లో

## వీఆర్ఏల సమ్మెకు రేవంత్ మద్దతు



**హైదరాబాద్,అక్టోబర్ 7 (సమ సమాజం):** వీఆర్ఏలు 75 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం దున్నపోతుపై వాన పడినట్లుగా వ్యవహరిస్తోందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. వినతిపత్రం ఇస్తే వీఆర్ఏల ముఖంపై విసిరికొట్టడం కేసీఆర్ అహంకారానికి నిదర్శనమన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ తహశీల్దార్ ఆఫీస్ ఎదుట వీఆర్ఏల ఆందోళనకు రేవంత్ సంఘీభావం తెలిపారు. తమ సమస్యలపై రేవంత్ రెడ్డికి వీఆర్ఏలు వినతిపత్రం ఇచ్చారు. ప్రజా, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేసీఆర్..తగిన మూల్యం చెల్లించక తప్పదని మండిపడ్డారు. పార్టీ తరఫున వీఆర్ఏల పోరాటానికి అండగా ఉంటామని.. వారి డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు.

## సిఎం కెసిఆర్ పాలపిట్టదర్శనం వివాదాస్పదం

- పంజరంలో పాలపిట్టను బంధించడం నేరం
- మండిపడుతున్న జంతు ప్రేమికులు





**హైదరాబాద్, అక్టోబర్ 7 (సమ సమాజం):** తెలంగాణలో దసరా రోజు పాలపిట్టను దర్శించుకోవడం ఆనవాయితి. పండుగ పూట పాలపిట్టను చూస్తే సకల శుభాలు కలుగుతాయని జనం నమ్మకం. అంతరించే దశలో ఉన్న ఈ పక్షులు కనిపించడం అత్యంత అరుదు. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులకు మాత్రం పాలపిట్ట దర్శనభాగ్యం దక్కింది. దసరా రోజు ప్రగతి భవన్ లోని నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన కేసీఆర్ ఆ తర్వాత ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం ఆయన ప్రగతి భవన్‌లో పాలపిట్టను దర్శించుకున్నారు. పంజరంలో ఉన్న పాలపిట్టకు సీఎం కేసీఆర్, ఆయన 3లో

## మునుగోడులో డబ్బుల పంపిణీకి తెరాస యత్నాలు

ఓటుకు 40 వేలు ఇస్తోందని ఆరోపించిన బండి సంజయ్

ఏబీవీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల నరసయ్య సంస్మరణ సభలో వెల్లడి



**హన్మకొండ, అక్టోబర్ 7 (సమ సమాజం):** మునుగోడులో ఓటుకు నలభై వేలు పంచేందుకు తెరాస సిద్ధంగా ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుగోడులో ఓటుకు రూ.40 వేలు పంచనుందని సంజయ్ ఆరోపించారు. హనుమకొండలోని ఏబీవీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల నరసయ్య సంస్మరణ సభలో పాల్గొన్న ఆయన.. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మునుగోడులో భాజపా భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మునుగోడు ఉప ఎన్నికలో ఓటుకు రూ.40 వేలు పంచేందుకు కూడా వెనకాడం లేదంటే ఎంతగా తెగించిందో తెలుసుకోవాలని అన్నారు. అధికారం అడ్డుతో కేసీఆర్ పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. హనుమకొండలోని అభిరామ్ గార్డెన్‌లో జరిగిన ఏబీవీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల నరసయ్య సంస్మరణ సభలో పాల్గొన్న ఆయన.. గుజ్జల నరసయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు 3లో

## తదుపరి సిజెఐ పదవిపై కేంద్రం కసరత్తు

- వారసుడిని గుర్తించాలంటూ జస్టిస్ ఉమేశ్ లలిత్‌కు లేఖ
- తదుపరి చీఫ్ జస్టిస్‌గా డివై చంద్రచూడ్‌కు అవకాశాలు



**హైదరాబాద్, అక్టోబర్ 7 (సమ సమాజం):** తదుపరి సీజేఐగా ఎవరిని నియమించాలో సూచించాలని కోరుతూ..భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లలిత్‌కు కేంద్ర ప్రభుత్వం ఓ లేఖ రాసింది. ప్రస్తుతభారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్ నవంబర్ 8న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం.. తదుపరి సీజేఐ ఎంపికకు కసరత్తు ప్రారంభించింది. 50వ సీజేఐగా ఎవరికి అవకాశం ఇవ్వాలో సూచించాలని కోరుతూ జస్టిస్ లలిత్‌కు లేఖ రాసింది. ఆనవాయితీ ప్రకారం సీజేఐ తన వారసునిగా అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును ప్రతిపాదిస్తారు. ప్రస్తుత సీజేఐ జస్టిస్లలిత్ తర్వాత అత్యంత సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఉన్నారు. సాధారణంగా.. భారత ప్రధాన న్యాయమూర్తి సూచించే పేరును కేంద్ర ప్రభుత్వం ఖరారు చేస్తూ ఉంటుంది. జస్టిస్ ఎన్వీ రమణ భారత ప్రధాన న్యాయమూర్తి ఆగస్టు 26న పదవీ విరమణ చేశారు. ఆగస్టు 27న సీజేఐగా జస్టిస్ యూయూ లలిత్ బాధ్యతలు చేపట్టారు. ఆయన పదవీ కాలం దాదాపు 3 నెలలే. మరో నెల రోజుల్లో ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తదుపరి సీజేఐ నియామక పక్రియ ప్రారంభించింది. భారత ప్రధాన న్యాయమూర్తి యూయూ లలిత్ నవంబర్ 8వ తేదీన రిటైర్ కానున్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సీజేఐగా ఎవర్ని నియమిస్తారో చెప్పాలంటూ లలిత్‌కు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ శుక్రవారం లేఖ రాసింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆ లేఖ రాశారు. సుప్రీంకోర్టు తదుపరి సీజేఐని నియమించాలని ఆయన ఆ లేఖలో కోరారు. సీనియార్టీ ప్రకారం జస్టిస్ డీవై చంద్రచూడ్ తదుపరి సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత సీజే లలిత్ తర్వాత ఆయనే సుప్రీంలో సీనియర్ జస్టిస్. జస్టిస్ చంద్రచూడ్ పేరును సీజే లలిత్ ప్రతిపాదించే అవకాశాలు ఉన్నట్లు 3లో

## అక్రమ సంపాదనతోనే జాతీయపార్టీ

- అదే డబ్బుతో విమానం కొనుగోలు
- బిజెపి ఎమ్మెల్యే ఈటెల మండిపాటు



**మెదక్, అక్టోబర్ 7 (సమ సమాజం):** ముఖ్యమంత్రి కేసీఆర్ అక్రమంగా సంపాదించిన డబ్బుతో బీఆర్ఎస్ పార్టీ పెట్టాడని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. ఈ నెల 9న నర్సాపూర్ మున్సిపల్ ఛైర్మన్ మురళీ యాదవ్ బీజేపీలో చేరుతున్న నేపథ్యంలో సభాస్థలిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఈటల.. నర్సాపూర్, జహీరాబాద్, గజ్వేల్, పఠాన్ చెరు 3లో

## మునుగోడు ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

- 14 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం
- 15న నామినేషన్ల పరిశీలన..17న ఉపసంహరణ
- 3న ఎన్నిక..6న కౌంటింగ్..తొలిరోజే నగదు పట్టివేత



**హైదరాబాద్, అక్టోబర్ 7 (సమ సమాజం):** నల్లగొండ జిల్లా మునుగోడు శాసనసభ స్థానం ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడులయింది. నామినేషన్లు తక్షణమే ప్రారంభమవుతాయని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొన్నది. ఈ నెల 14 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని, 15న నామినేషన్ల పరిశీలిస్తామని వెల్లడించింది. నామినేషన్ల 3లో

## ఉమ్మడిగా నోబుల్ శాంతి బహుమతి

- బెలారస్ మానవహక్కుల కార్యకర్త అలెస్ బైలియాట్ స్కీ
- రష్యా,ఉక్రెయిన్ శాంతి సంఘాల ఎంపిక



**స్టాక్ హోం, అక్టోబర్ 7 (సమ సమాజం):** ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ, సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం పాటుపడే వ్యక్తులు లేదా సంస్థలకు ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతిని బహూకరిస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా నోబెల్ శాంతి బహుమతిని శు 3లో

## సంపాదకీయం

# రాష్ట్రాలను కలుపుకుని పోవాల్సిందే !

కొత్త పార్టీ ప్రకటించిన సిఎం కెసిఆర్ ఎపిని కలుపుకుని పోతారా లేక..అక్కడ తనే ప్రత్యేక ముద్ర వేస్తారా అన్నది చూడాలి. అక్కడ వైసిపి, టిడిపిలు బలంగా ఉన్నాయి. ఈ రెండు పార్టీలను ఢీకొని నిలబడగలుగు తారా అన్నది కూడా చూడాలి. బిఆర్ఎస్‌ను విస్తరించే క్రమంలో ప్రజల్లోనూ. స్థానినేతల్లోనూ బలమైన నమ్మకం రావాలి. అలాగే విభజన తరవాత నివురుగప్పిన నిప్పులా ఉన్నా సమస్యలు ఇప్పుడు ఉప్పెనాలా దూసుకువచ్చే ప్రమాదం కూడా లేకపోలేదు. ముంపు మండలాలు, పోలవరం, విద్యుత్ బకాయిలు తదితర అంశాలు ఇప్పటికే వెన్నాడుతున్నాయి. వీటన్నిటికి సమాధానం దాటవేయ లేం. మోడీలాగా మాట్లాడితే కెసిఆర్‌కు కుదరదు. ముందుగా ఇరు తెలుగు రాష్ట్రాల ప్రజల ఆదరాభి మానాలు పొందగలగాలి. సమస్యలపై స్పష్టత రావాలి. మరోవైపు రాష్ట్రాల్లో ఎవరి సమస్యలు వారికి ఉన్నాయి. అలాగే ప్రాంతీయ పార్టీల్లో బలమైన నేత కూడా లేడు. మమతా బెనర్జీ బెంగాల్‌కు తప్ప బయటకు పనికిరారని తేలిపోయింది. ఈ క్రమంలో కేంద్రంలో విపక్ష బాధ్యత నిర్వహించే ధీటైన నేతకూడా లేకుండా పోయారు. పార్లమెంటులో గట్టిగా మాట్లాడే సమర్థ నాయకుడు లేడు. కాంగ్రెస్‌లో ఉన్న నేతల్లో వాగ్ధాటి ఉన్ననేతలు కూడా లేరు. విపక్షాల్లో అనైతకృత, ఉన్నవారికి ఛరిష్మా లేకపోవడం కారణంగా మోడీ దూకుడుకు కళ్లెం వేయలేక పోతున్నారు. అంతేగాకుండా నేతలంతా అవినీతి కుంభకోణాల్లో మునిగి పోయారు. కాంగ్రెస్ నేత రాహుల్ అయితే అస్త్రసన్యాసం చేశారు. ప్రియాంకకు కూడా అంత సీన్ లేదని గతకొంతకాలంగా ఆమె రాజకీయాలు చూస్తుంటే అర్థం అవుతోంది. బిజెపిలోనే మోడీకి బలమైన నేత లేకుండా పోయింది. అలా మరోనేత తనకు పోటీగా రాకుండా కూడా మోడీ చూసుకుంటున్నారు. బలమైన ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల మోదీ వైపే ప్రజలు మొగ్గు చూపిస్తున్నారు. గత ఎన్నికల్లో మరోమారు మోడీ అధికారంలోకి రావడానికి బలమైన ప్రతిపక్షం లేకపోవడమే అన్నది గుర్తించాలి. 370 ఆర్టికల్ రద్దు, ముస్లిం మహిళల రక్షణకు ట్రిబుల్ తలాక్ చట్టం తేవడం, అమోధ్య సమస్యకు పరిష్కారం చూపడం, రక్షణరంగంలో బలంగా నిలవడం వంటివన్నీ ప్రజల దృష్టిలో మోడీని హీరోగా నిలిపాయి. అయినా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉండనే ఉంది. వీటన్నటింని కెసిఆర్ ఎలా పరిష్కరిస్తారన్నది కూడా ముఖ్యం. బలమైన సిద్దాంత పునాది అవసరం. దేశంలో కెసిఆర్ ప్రస్తావిస్తున్న అనేకానేక సమస్యలకు పరిష్కారం ఎలా ఉండబోతుందో ఓ ప్రణాళిక అవసరం. అది అన్ని రాష్ట్రాల్లో ప్రజలను,మేధావులను ఆలోచింప చేసేదిగా ఉండాలి. దేశంలోఆర్థికంగా ప్రజలు దిగజారుతున్నారు. డాలర్ విలువ పెరుగుతోంది. రూపాయికి విలువ లేకుండా పోయింది. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఈ నేపథ్యంలో బలమైన విపక్షం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. అంతటి సత్తా రాహుల్ లేదా..ప్రియాంక వాద్రాకు లేదు. అలాగే వారసత్వ రాజకీ యాలను ప్రజలు కోరుకోవడం లేదు. ప్రధాని మోదీకి దీటైన ప్రతిపక్షం జాతీయ స్థాయిలో సిద్ధం కావాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారు. ఇవన్నీ మంచి తరుణాన్ని సూచిస్తున్నా..ఉత్తరాదికి పెద్దగా పరిచయం లేని కెసిఆర్ తెలంగాణ మోడల్ అంటే నమ్ముతారా అన్నది కూడా ముఖ్యమే. అయితే బలమైన ప్రతిపక్షం ఏదైనా రాగలదా అని కూడా ఎదురుచూస్తున్నారు. కీలెరిగి వాతపెట్టాలన్నది సామెత. రోగానికి తగ్గ మందు ఉంటేనే అది నయం అవుతుంది. ఇప్పటి వరకు జాతీయ రాజకీయాల్లో బిజెపి దూకుడును అడ్డుకునే మొనగాడే లేకుండా పోయాడు. అలాగే మోడీ నిర్ణయాలను నిగ్గదీయగలిగిన దీటైన నేత కూడా లేకుండా పోయాడు. అనేకానేక అంశాలపై సాధికారికంగా మాట్లాడే నేత లేడన్న భావనలో ప్రజలు ఉన్నారు. ప్రాంతీయ పార్టీల నేతల్లో కెసిఆర్ ఒక్కరే సరైన లేదా బలమైననేతగా ఉన్నారు. ఆయనకు జాతీయ రాజకీయాలతో పాటు,రాజ్యాంగం, అంతర్జాతీయ వ్యవహారాలు కొట్టిన పిండి. జగన్, స్టాలిన్,మమతా బెనర్జీ, పట్నాయక్ వంటి వారెవరూ మోడీని ఢీకొనే సత్తా చాటలేరని తేలింది. ఈ క్రమంలో మోడీని ఢీకొనేందుకు రెడీ అవుతున్న కెసిఆర్ గట్టిగా పోరాడుతారా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. కేంద్రంతో పోరాడేందుకు ఆయన అడుగు వేసినా ఇతర ప్రాంతీయపార్టీల నేతలు మద్దతు ఇస్తారా అన్నది కూడా అనుమానమే. గత సార్వత్రిక ఎన్నికలకు ముందే కెసిఆర్ ఓ ప్రయోగం చేసినా అడుగు ముందుకు పడలేదు. మోడీ మరో మారు భారీ మెజార్టీతో అధికారంలోకి రావడంతో పాటు..తెలంగాణలో కూడా బిజెపి నాలుగు సీట్లు గెల్చుకుంది. కాంగ్రెస్ మరో మూడు సీట్లు గెల్చుకుంది. దీంతో కెసిఆర్ కూడా వెనక్కి తగ్గారు. ఇకపోతే కేవలం సెంటిమెంటంతోనే పోదామంటే కెసిఆర్‌కు కూడా కాలం కలసి రాకపోవచ్చు. మోదీ, అమిత్ షాల గురించి ప్రజలకు తెలుసు. కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారనీ తెలుసు. అయితే వారి వల్ల దేశ ఆర్థిక ప్రగతిలో పెద్దగా మార్పు రాలేదన్న భావన సర్వత్రా ఉంది. ఈ ఏకపక్ష నిర్ణయాలను ప్రజలు స్వాగతించడం లేదు. దేశంలో ఇప్పుడున్న రాజకీయ నేతల్లో కెసిఆర్‌కున్న రాజకీయ నిబద్దత, అవగాహన మరెవరికీ లేదు. అలాగే ఆయన భారత రాజకీయాలు, ప్రపంచరాజకీయాలను బాగా ఔపోసన పట్టారు. అందుకే కెసిఆర్ కూడా జాతీయ రాజకీయాల్లోకి ఎంటర్ అయ్యేందకు రంగం సిద్దం చేసారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చారు. కెసిఆర్ వేస్తున్న అడుగులు రాబోయే రోజుల్లో మార్పును తీసుకుని వస్తాయా అన్నది ఇప్పుడే చెప్పలేం. అయితే సమస్యలకు పరిష్కారం చూపే ప్రణాళిక ప్రజల ముందు పెట్టాలి. కెసిఆర్ జాతీయరాజకీయాలను తన గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు వ్యూహం పన్నడం ఖాయంగా కనిపిస్తోంది. సాగు చట్టాలను, బడ్జెట్ కేటాయింపులను తీవ్రంగా వ్యతిరేకించిన సిఎం కెసిఆర్ ఇప్పటికే మోడీ తీరుపై మండిపడుతూనే ఉన్నారు. దేశ సమస్యలను కేంద్రం సరిగా అడ్రస్ చేయడం లేదని ముందునుంచీ వాదిస్తున్నారు. పౌరసత్వ చట్టం,సాగుచట్టాలు, కేంద్రరంగ సంస్థల అమ్మకం తదితర విషయాల గురించే చర్చలు సాగడం..వ్యతిరేకత రావడం జరిగినా మోడీ ప్రభుత్వం చలించడం లేదు. అందుకే ఈ సమస్యలను భుజాన వేసుకుని.. గట్టిగానిలదీయగలగాలి. విపక్షాలు లేవనెత్తిన అనేకానేక ప్రశ్నలను కెసిఆర్ తనదైన శైలిలో గట్టిగా వినిపించే సత్తా ఉంది. అవసరమైన పదజాలం, భావజాలం కెసిఆర్ సొంతం. అందుకే విపక్షానికి కెసిఆర్ బలం కాగలరు. బలమైన నేతగా రాణించగలరు. అయితే అన్ని ప్రాంతీయ పార్టీలు విభేదాలు పక్కనపెట్టి ముందుకు రాగలిగితేనే ఇది సాధ్యం. అందుకు ముందుగా పార్టీల్లో విశ్వాసం నింపగలగాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# మునుగోడు టిఆర్ఎస్ అభ్యర్థిగా కూసుకుంట్ల

**ప్రభాకర్ రెడ్డినే ఖరారు చేసిన సిఎం కెసిఆర్**

**10న నామినేషన్ వేయనున్నట్లు సమాచారం**



**హైదరాబాద్, అక్టోబర్ 7 (సమ సమాజం):** అధికార టీఆర్ఎస్ పార్టీ మునుగోడు అభ్యర్థిని ఖరారుచేసింది. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని తమ అభ్యర్థిగా ప్రకటించింది. కూసుకుంట్లకు అవకాశమిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మునుగోడు ఉప ఎన్నికలో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా.. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ప్రకటించారు. నియోజకవర్గంతోపాటు జిల్లాలో వేర్వేరుగా ప్రజాభిప్రాయ సేకరణ, సర్వేల అనంతరం ప్రభాకర్ రెడ్డి వైపే కేసీఆర్ మొగ్గు చూపారు. పార్టీ ఆవిర్భావ కాలం నుంచీ ఉద్యమకారుడి కొనసాగుతూ, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేస్తున్న కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డినే స్థానిక నాయకులు కార్యకర్తలు, జిల్లా పార్టీ నాయకత్వం, నియోజకవర్గ ప్రజల అభిప్రాయాలు కోరుకుంటున్నాయని..అలాగే ఆయనే ఉత్తమ అభ్యర్థిగా సర్వే రిపోర్టల్లో తేలిందని గులాబీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి 2003 నుంచి టీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. తెలంగాణలో జరిగిన పలు ఉపఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేశారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు ఎమ్మెల్యేగా ఆయన విజయం సాధించారు. అయితే 2018లో జరిగిన ఎన్నికల్లో పరాజయంపాలయ్యారు. అప్పటినుంచి మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతు న్నారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయడంతో మునుగోడు ఉపఎన్నిక అనివార్యమయింది. ఇప్పటికే ఉపఎన్నిక నామినేషన్ల పక్రియ ప్రారంభమైంది. ఈ నెల 14 వరకు నామినేషన్లు సమర్పించవచ్చు. 15న నామినేషన్లను పరిశీలించనున్నారు. 17 వరకు నామపత్రాల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. నవంబర్ 3న పోలింగ్ జరుగనుంది. అదేనెల 6న ఫలితాలు వెలువడనున్నాయి. కాగా, పార్టీ అభ్యర్థిగా కూసుకుంట్ల పేరును ప్రకటించడంతో నియోజకవర్గం వ్యాప్తంగా టీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకుంటున్నారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పటాకులు పేల్చారు. చండూరు, మర్రిగూడెం, నాంపల్లి, గట్టుప్పల్ మండలాల్లో సంబురాలు చేసుకున్నారు. పార్టీ అధినేత నిర్ణయం మేరకు భారీ మెజార్టీతో ప్రభాకర్ రెడ్డిని గెలిపించు కుంటామని స్పష్టం చేశారు. ఇదిలావుంటే బిజెపి నుంచి రాజగోపాల్ రెడ్డి రంగంలో ఉండగా కాంగ్రెస్ పాల్వాయి స్రవంతి పేరును ఖరారు చేసింది. ఇప్పటికే అన్నిపార్టీలు ప్రచారంలో దిగాయి. లెఫ్ట్ పార్టీలు టిఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచాయి. 2014లో మునుగోడు ఎమ్మెల్యేగాకూసుకుంట్ల గెలిచారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. మునుగోడులో 70 శాతానికిపైగా బీసీ ఓటర్లు ఉన్నారు. దీంతో సర్వేల ఆధారంగా కూసుకుంట్ల వైపే కేసీఆర్ మొగ్గు చూపారు. మునుగోడు నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా ఉన్న కూసుకుంట్ల..ఈనెల 10న నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్‌కు మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి హాజరుకానున్నారు.

# నిద్రిస్తున్న తల్లీకూతుళ్లపై దాడి

**దుండగుల కత్తిదాడిలో కూతురు మృతి**

**తీవ్రగాయాలపాలైన తల్లి ఆస్పత్రికి తరలింపు**

**20 రోజేఉల్లోపే భర్తను కోల్పోయి..కూతురు మృత్యువాత**



**కరీంనగర్, అక్టోబర్ 7 (సమ సమాజం):** కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలంలో దారుణం చోటుచేసుకున్నది. మండలంలోని రామకృష్ణకాలనీలో తల్లీకూతుళ్లపై దుండగులు కత్తితో దాడిచేశారు. దీంతో కూతురు మరణించగా, తల్లి తీవ్రంగా గాయపడింది. రామకృష్ణ కాలనీకి చెందిన బాలవ్వ, సులోచన తల్లీ కూతుళ్లు. గురువారం రాత్రి ఇద్దరు ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వారిపై కత్తితో దాడికితెగబడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడిన సులోచన అక్కడికక్కడే మృతిచెందింది. రక్తపు మడుగులో పడిఉన్న బాలవ్వను గుర్తించిన స్థానికులు దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, దాడికి భూతగాదాలే కారణమని స్థానికులు భావిస్తున్నారు. ఓ రకంగగా విధి ఆమెపై కోపం చూపిందో ఏమో! భర్త చనిపోయి 20 రోజులు అయ్యింది. ఇంక ఏ దిక్కులేక, ఒంటరిగా ఉండలేక.. కన్న బంధాన్ని వదులుకోలేక పుట్టింటికి వచ్చేసింది.. అయితే మళ్లీ ఇక్కడా కూడా విధి ఆమెపై మరోలా చూసింది.. భర్త చనిపోయి ఒంటరిగా ఉంటున్న మహిళ.. పుట్టింటికి వెళితే అక్కడ హత్యకు గురైన ఘటన తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీలో చోటుచేసుకుంది. అర్ధరాత్రి రెండు గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి తల్లీ కుమార్తెలపై దాడి చేశారు. ఈ ఘటనలో కుమార్తె మృతి చెందగా... తల్లికి తీవ్రగాయాలవ్వడంతో ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు ప్రారంభించారు. ఎస్సై శీలం ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణ కాలనీలో నివాసం ఉంటున్న కొమ్మెర రాధవ్వ(75)కు కుమార్తె గుజ్జుల సులోచన ఉంది. ఆమెకు వివాహం అయింది. అయితే ఆమె భర్త 20రోజుల క్రితం చనిపోవడంతో ఒంటరిగా ఉండలేక తల్లి వద్దే ఉంటుంది. అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి సులోచన, ఆమె తల్లిపై దాడి చేశారు. ఆ దాడిలో సులోచని అక్కడికక్కడే మృతి చెందగా, తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఎస్సై ప్రమోద్ రెడ్డి ఘటనా ప్రదేశాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. కుటుంబ కలహాలే కారణమా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా ఈ హత్యపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మునుగోడులో 500 కోట్లు ఖర్చు చేయనున్న రాజగోపాల్ రెడ్డి

**తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలు జంప్ కావడం ఖాయం**

**వచ్చే 2024 ఎన్నకలే తమ టార్గెట్ అన్న మంత్రి కెటిఆర్**



**హైదరాబాద్, అక్టోబర్ 7 (సమ సమాజం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కాదని కాంగ్రెస్ జోడో యాత్ర చేపట్టాలని మంత్రి కెటిఆర్ సూచించారు. మంత్రి కెటిఆర్ మీడియాతో చిట్ చాట్ చేశారు. రాహుల్ కేరళలో యాత్ర చేస్తుంటే గోవాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పక్క పార్టీలో చేరారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలు ఆ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మునుగోడు లో టిఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మునుగోడులో 500 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బిజెపి పెద్దలకు చెప్పారని ఆరోపణలు చేశారు. 22000 కోట్ల కాంట్రాక్టుని శుశి ఇన్ ఫ్రాకు ఇస్తేనే రాజగోపాల్ రెడ్డి బిజెపి చేరారని ఆరోపణలు చేశారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అవసరం ఎంతైనా ఉందని, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రజలు తెలంగాణ రాష్ట్రంలో కలపాలని ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్నారని కెటిఆర్ గుర్తు చేశారు. రైతుబంధు, రైతుభీమా వంటి పథకాలు దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ పెరుగుతుందన్నారు. దేశంలో 10 వేల మంది మొబైల్ ఫోన్ ట్యాప్ అవుతున్నాయని, కిషన్ రెడ్డి ఫోన్ కూడా ట్యాప్ అవుతుందని, బిజెపి మల్టీ ఫేసెడ్ పార్టీ అని, బిజెపి నేషనల్ పార్టీ అయినా నడిపించేది గుజరాతీలు అని మండిపడ్డారు. బిజెపి అంటే దేశ ప్రజలకు తెలుసునని, గుజరాత్ మోడల్ ఫేక్ మోడల్ అని మండిపడ్డారు. సుజనా చౌదరి, సిఎం రమేష్ పైన ఉన్న కేసులు ఏమయ్యాయని కెటిఆర్ ప్రశ్నించారు. అంత వాషింగ్ పౌడర్ నిర్మా లాగానే ఉంది బిజెపి కేంద్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. ఇడి, సిబిఐ, ఐటిలను బిజెపి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, ప్రతిపక్ష పార్టీలపై మాత్రమే ప్రయోగిస్తుందని మండిపడ్డారు. తమ పార్టీ ఫోకస్ 2024 లోకసభ ఎన్నికలపై పెడుతామని వివరించారు.

# రెండో పెళ్లి ఒప్పుకోని యువతిపై ఘాతుకం

**నిద్రిస్తున్న సమయంలో పెట్రోల్ పోసి నిప్పు**

**చావుబతుకుల్లో యువతి ..యువకుడి పట్టివేత**



**రాంచి, అక్టోబర్ 7 (సమ సమాజం):** అతడికి ఇదివరకే పెళ్లయింది. కానీ తన మాజీ ప్రేయసిని పెళ్లాడాలని ఆమెను బలవంతపెట్టాడు. దానికి ఆ యువతి నిరాకరించడంతో ..ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు.తనని పెళ్లి చేసుకునేందుకు నిరాకరించిందని 22 ఏళ్ల యువతిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడా దుర్మార్గుడు. యువతి నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి దూరి ఆమెను చంపాడు. ఈ ఘటన ఝార్ఖండ్‌లోని డుమ్కా జిల్లాలో జరిగింది. డుమ్కా జిల్లా బాల్కీ గ్రామానికి చెందిన ఓ యువతికి మహేశ్‌పూర్‌కు చెందిన రాజేష్ అనే యువకుడితో 2019లో పరిచయం ఏర్పడింది. దాదాపు మూడేళు గా వారిద్దరూ ప్రేమించుకుంటుడగా 2022లో రాజేష్‌కు మరొకరితో వివాహం జరిగింది. దీంతో యువతి తల్లిదండ్రులు సైతం ఆమెను మరొకరి ఇచ్చి వివాహం జరిపించేందుకు సిద్ధమయ్యారు. కానీ రాజేష్ మాత్రం తననే పెళ్లి చేసుకుంటానని యువతి వెంటపడ్డాడు. యువతి ఎంత చెప్పిన వినకపోవడంతో ఆమెను చంపుతానని బెదిరించాడు.శుక్రవారం ఉదయం ఎవరూ లేని సమయం చూసుకుని రాజేష్ యువతి ఇంటికి వెళ్లాడు. ఇంటి తలుపులు బద్దలు కొట్టుకుని వెళ్లి అప్పటికే పడుకుని ఉన్న యువతిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తర్వాత అక్కడ నుంచి పరారయ్యాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యువతి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. తదుపరి చికిత్స కోసం మరో ఆస్పత్రికి తరలించాలని సూచించారు. నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# కెసిఆర్ దయతో రెండు పంటలు పండిస్తున్నాం

**దుబ్బాక నీటి గోసన తీర్చిన ఘనత టిఆర్ఎస్‌దే**

**మంత్రి హరీష్ రావు వెల్లడి**



**సిద్దిపేట, అక్టోబర్ 7 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచింది.. ఒకప్పుడు ఎవుసానికై ముఖాన్ని మొగులుకు పెట్టి చూసేవారమని, కాలం ఎట్లయితదోనని పంచాంగ శ్రవణం వినేవారమని, కానీ సీఎం కేసీఆర్ దయతో కాలమైనా, కాకున్నా రెండు పంటలు పండిస్తున్నామని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ హరీశ్ రావు స్పష్టం చేశారు. సిద్ధిపేట జిల్లా దుబ్బాక కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్, దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ మేరకు దుబ్బాక నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా భాస్కర్ చారి, తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమురయ్య, దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇప్ప లక్ష్మి.. మంత్రి హరీశ్ రావు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గ ఆత్మ కమిటీ, తొగుట, దౌల్తాబాద్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికీ శుభాకాంక్షలు తెలిపారు. కాలమైనా కాకపోయినా తెలంగాణ రాష్ట్రంలో రెండు పంటలు పండిస్తున్నారని, తాగు, సాగునీరు ఇచ్చి తెలంగాణ రాష్ట్రం, దుబ్బాక నియోజకవర్గం గోస తీర్చింది సీఎం కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. జై జవాన్-జై కిసాన్ అనే నానుడి లేకుండా.. ఓ వైపు రైతులకు గోస పెట్టి, మరోవైపు సైనికులకు కూడా అగ్నిపథ్‌తో దేశ యువతను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని మంత్రి మండిపడ్డారు. విద్యుత్ మీటర్ల నిబంధన లేకపోతే తెలంగాణ రాష్ట్రాని యేటా రూ. 6 వేల కోట్లు, రెండేళ్లలో రూ. 12 వేల కోట్లు ఎందుకు నిలిపివేశారో బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. చట్టంలో విద్యుత్ మీటర్లు లేకపోతే రెండేళ్లలో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన రూ. 12 వేల కోట్లు విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 65 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం కింద రైతుబంధు అందించామని, ఇందు కోసం రూ. 57 వేల 8 వందల 80 కోట్లు వెచ్చించినట్లు మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు రూ.5 లక్షల కింద రైతుబీమా సాయం అందించిన ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వమని, ఇప్పటికే 87 వేల మంది రైతుల కుటుంబాలకు రూ.4333 కోట్ల రైతుభీమా సాయాన్ని అందించినట్లు మంత్రి హరీశ్ గుర్తు చేశారు. రైతుబంధు, అమృత్ సరోవర్, హర్ ఘర్ కో జల్, మూగజీవాలకు అంబులెన్స్ 1962లను దేశమంతా అమలు చేస్తూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కేంద్రం కాపీ కొట్టిందని, ఇందుకు తెలంగాణ రాష్ట్రం స్ఫూర్తి దాయకంగా నిలిచిందని సగర్వంగా మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కోతలు, వాతలు తప్ప ఇచ్చిందేమీ లేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# కూసుకుంట్ల విజయానికి కృషిచేయాలి

(మొదటి పేజీ తరువాయి..)అయితే ప్రస్తుత ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయడంతో మునుగోడు ఉపఎన్నిక అనివార్యమయింది. ఈ క్రమంలో సీఎం కేసీఆర్‌తో నర్సయ్య గౌడ్, కర్నె ప్రభాకర్ భేటీ అయ్యారు. మునుగోడు తెరాస టికెట్‌ను బూర నర్సయ్య, కర్నె ప్రభాకర్‌లు ఆశించారు. అయితే దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్ మునుగోడులో తెరాస విజయానికి అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో నేతలందరికీ అవకాశాలు ఉంటాయని హామీఇచ్చారు. సీఎం వారికి సర్దిచెప్పడంతో… కూసుకుంట్ల గెలుపు కోసం కృషి చేస్తామన్న నర్సయ్య, కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు. ఇదిలావుంటే మునుగోడు ఉప ఎన్నిక అభ్యర్థి ప్రకటనకు ముందు ప్రగతి భవన్ లో పార్టీ నేతలతో కేటీఆర్ కీలక సమావేశం నిర్వహించారు. టికెట్ ఆశిస్తున్న ఆశావహులందరితో సమావేశం జరిపి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులు, జిల్లా నాయకులు, సర్వే రిపోర్టుల వివరాలను ఈ సందర్భంగా పార్టీ నేతలకు వివరించినట్లు తెలుస్తోంది. అభ్యర్థి ఎవరైతే పోటీ ఎలా ఉంటుంది.. అనే విషయాలను లోతుగా వివరించి తెలియజేసి.. అంతిమ నిర్ణయానికి అందరూ కట్టుబడేలా సర్దిచెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. జిల్లా నేతలు, నియోజకవర్గ నేతలు, స్థానిక ప్రజలు, ప్రత్యర్థి పార్టీల బలాబలాలు.. పోటీ వివరాలను విశ్లేషిస్తూ వివరించడంతో అంతిమ నిర్ణయం మీ ఇష్టం అంటూ అందర్నీ ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ప్రగతి భవన్ లో మంత్రి కేటీఆర్ తో జరిగిన సమావేశంలో జిల్లా మంత్రి జగదీశ్ రెడ్డి,మాజీ ఎంపీ బుర నర్సా గౌడ్, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నట్లు సమాచారం.

# తదుపరి సిజెఐ పదవిపై కేంద్రం కసరత్తు

(మొదటి పేజీ తరువాయి..)తెలుస్తోంది. జస్టిస్ చంద్రచూడ్ చాలా రోజులు సీజేఐ పదవిలో ఉండే ఛాన్సు ఉంది. ఒకవేళ చంద్రచూడ్ సీజేఐగా నియామకం చెందితే .. అప్పుడు ఆయన 2024, నవంబర్ 10వ తేదీన రిటైర్ అవుతారు. అంటే రెండేళ్ల పాటు ఆయన ఆ పదవిలో ఉంటారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(2) ప్రకారం సీజేఐ నియామకం జరుగుతుంది. దాని ప్రకారమే కేంద్ర న్యాయ శాఖ మంత్రి .. ప్రస్తుత సీజేఐకి లేఖ రాయడం జరిగింది. మరో వైపు ప్రస్తుతం సుప్రీంకోర్టులో నాలుగు జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒకవేళ వారసుడిని సీజేఐ ప్రకటిస్తే, అప్పుడు ఆ పోస్టులను నింపేందుకు జస్టిస్ లలిత్ కొలీజియం మీటింగ్‌ను నిర్వహించడం వీలుకాదు. రిటైర్మెంట్‌కు నెల రోజుల దూరంలో ఉన్న జస్టిస్ లలిత్.. ఎటువంటి కొత్త అపాయింట్లను ఇవ్వడం కుదరదు.

# మునుగోడులో డబ్బుల పంపిణీకి తెరాస యత్నాలు

(మొదటి పేజీ తరువాయి..) లర్పించారు. ప్రభుత్వవ్యతిరేక ఓట్లను చీల్చేందుకు తెరాస, కాంగ్రెస్ కలిసి కుట్ర చేస్తున్నాయని బండి సంజయ్ విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా భాజపా భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తాగి తందనాలు ఆడటానికే రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు మునుగోడులో మకాం వేస్తున్నారని బండి సంజయ్ దుయ్యబట్టారు. అధికారం అడ్డం పెట్టుకొని కేసీఆర్ పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. కాంగ్రెస్, తెరాస ఒక్కటే. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకు రెండు పార్టీలు కుట్రలు పన్నుతున్నాయి. మునుగోడులో ముందే వారికి అనుకూలంగా ఉన్న అధికారులను బదిలీలు చేసుకున్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మునుగోడులో భాజపా భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు.

# అక్రమ సంపాదనతోనే జాతీయపార్టీ

(మొదటి పేజీ తరువాయి..) నుంచి భారీగా చేరికలు ఉంటాయని చెప్పారు. అయితే జిల్లా మంత్రి హరీష్ రావుతో పాటు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరకుండా సర్పంచులను భయపెడుతున్నారని ఆరోపించారు. వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్, 40 ఏండ్ల బీజేపీకి పార్టీకి ఇప్పటి వరకు సొంత విమానం లేదని, కేసీఆర్ మాత్రం రూ.270కోట్లు పెట్టి విమానం కొనుగోలు చేశాడని ఈటల రాజేందర్ ఆరోపించారు. ప్రతి గ్రామంలో వంద బెల్ట్ షాపులు పెట్టిన ఘనత కేసీఆర్ సొంతమని విమర్శించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.25కోట్లు ఇస్తున్న ముఖ్యమంత్రి.. మద్యం ద్వారా రూ.50కోట్ల ఆదాయం సంపాదిస్తున్నాడని అన్నారు. వెయ్యి నుంచి 1500 జనాభా ఉన్న పల్లెటూళ్లలో 10 నుంచి 15 బెల్టు షాపులు పెట్టి మద్యాన్ని విచ్చలవిడిగా అమ్ముతున్నారని మండిపడ్డారు. తాగుడుకు బానిసై 40ఏండ్లకే మగాళ్లు చచ్చిపోతుంటే ఆడపడుచులు ఆగమైపోతున్నారని ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. దళిత బంధు, గిరిజన బంధు, గొల్లకురుమలకు గొర్రెలతో పాటు అన్ని కలాల్లోని పేదలకు పేదల బంధు ఇవ్వాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. దళితులకు మూడెకరాలు ఇస్తామన్న ముఖ్యమంత్రి ఎకరా కోటి నుంచి రూ.3 కోట్లు పలికే భూములను దళితులు, పేదల నుంచి గుంజుకుం టున్నారని ఆరోపించారు. కంపెనీల పేరుతో కోట్ల విలువైన భూములకు కేవలం రూ.10 లక్షలు ఇచ్చి కేసీఆర్ తన బంధువర్గానికి వాటిని దారాదత్తం చేస్తున్నారని ఈటల ఫైర్ అయ్యారు.

# ఎపి ప్రభుత్వానికి మరో అరుదైన గౌరవం

## స్వచ్ఛ సర్వేక్షణ్ -2022లో ఏకంగా 11 అవార్డులు

## అధికారులను అభినందించిన సిఎం జగన్



**అమరావతి, అక్టోబర్ 7 (సమ సమాజం):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మరో అరుదైన గౌరవం లభించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ -2022లో ఏంగా 11 అవార్డులు అందుకోవడం విశేషం. కేంద్ర ప్రభుత్వం అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను కార్పొరేషన్ మేయర్లు, మున్సిపాల్టీల ఛైర్మన్లు, కమిషనర్లు, ఇతర అధికారులు అవార్డులను అందుకున్నారు. శుక్రవారం వీరంతా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సీఎం అవార్డు గ్రహీతలను అభినందించారు. గార్బేజ్ ఫ్రీ సిటీస్ అవార్డు కేటగిరీలో 5 స్టార్ రేటింగ్ తిరుపతి, విశాఖ కార్పొరేషన్లకు దక్కాయి. ఇక విజయవాడకు క్లీన్ స్టేట్ క్యాపిటల్ కేటగిరీలో అవార్డు అందింది. ఇక 50 వేల నుంచి లక్ష లోపు జనాభా ఉన్న మున్సిపాల్టీలకు సంబంధించి ఇన్నోవేషన్ అండ్ బెస్ట్ ప్రాక్టీసెస్ కేటగిరీలో పులివెందుల మున్సిపాలిటీకి అవార్డు వరించింది. 50 వేల నుంచి 1 లక్ష లోపు జనాభా ఉన్న మున్సిపాల్టీలకు సంబంధించి సిటిజన్ ఫీడ్ బ్యాక్ కేటగిరీలో పుంగనూరు మున్సిపాలిటీ అవార్డు దక్కింది. ఇండియన్ స్వచ్ఛతా లీగ్ కేటగిరీలో 15వేలలోపు జనాభా స్పెషల్ మెన్షన్ అవార్డు పొదిలికి దక్కింది. ఇండియన్ స్వచ్ఛతా లీగ్ కేటగిరీలో శ్రీకాకుళం కార్పొరేషన్ స్పెషల్ మెన్షన్ అవార్డు సాధించింది. ఇక 25 వేల నుంచి 50 వేలులోపు జనాభా ఉన్న మున్సిపాల్టీలకు సంబంధించి ఇన్నోవేషన్ అండ్ బెస్ట్ ప్రాక్టీసెస్ కేటగిరీలో సాలూరు మున్సిపాల్టీకి అవార్డు దక్కింది. రాష్ట్రంలో పరిశుభ్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం పురపాలక, పట్టణాభివృద్ధిశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరాల్లో పరిశుభ్రత, వేస్ట్ మేనేజ్‌మెంట్, పట్టణాల్లో సుందరీకరణ పనులు, టిడ్కో ఇళ్లు తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'వర్షాలు బాగా కురుస్తున్నాయి. మళ్లీ పట్టణాలు, నగరాల్లో రోడ్ల పరిస్థితిని పరిశీలించండి. సీజన్ ప్రారంభం కాగానే మళ్లీ డ్రైవ్ చేపట్టండి. మార్చి 31 కల్లా అన్నిరోడ్లనూ మళ్లీ బాగుచేయండి. గార్బేజ్ స్టేషన్ల కారణంగా పరిసరాల్లోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏమాత్రం ఉండకూదు. ప్రతి మున్సిపాల్టీలో కూడా వేస్ట్ ప్రాసెసింగ్ పక్రియల అమలు తీరును పరిశీలించాలి. కృష్ణా రిటైనింగ్ వాల్ బండ్‌ను చెట్లు, విద్యుత్ దీపాలు, ఏర్పాటుచేసి అందంగా తీర్చిదిద్దాలి' అని జగన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎ÷-లాస్టిక్ ప్లెక్సీలను నిషేధించిందని గుర్తు చేసిన ముఖ్యమంత్రి.. దానిని సంపూర్ణంగా అమలు చేయడానికి సంబంధిత వ్యాపారులతో కలెక్టర్లు సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ఎ÷-లాస్టిక్ నుంచి క్లాత్ వైపు మళ్లడానికి కావాల్సిన ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు అవసరమైన విధంగా వ్యాపారులకు తోడుగా ఉండాలని సూచించారు. వారికి రుణాలు ఇప్పించి అండగా నిలవాలన్నారు. ఇప్పించిన రుణాలను సకాలంలో కట్టేవారికి ప్రభుత్వం నుంచే వడ్డీ రాయితీ కల్పించేలా ఆలోచనలు చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు.

# ఉమ్మడిగా నోబుల్ శాంతి బహుమతి

(మొదటి పేజీ తరువాయి..)క్రవారం ప్రకటించారు. నోబెల్ శాంతి బహుమతి 2022 ని బహుమతి బెలారస్‌కు చెందిన మానవహక్కుల కార్యకర్త, లాయర్, అలెస్ బైలియాట్ స్కీ తో పాటు రష్యా, ఉక్రెయిన్ మానవహక్కులకు సంఘాలకు లభించింది. ఉక్రెయిన్-రష్యా మధ్య భీకర యుద్ధం జరుగుతున్న సమయంలో శాంతికి కృషి చేస్తున్న వాళ్లకు ఈ బహుమతిని ప్రకటించారు. నోబెల్ శాంతి బహుమతి కోసం 343 మంది పోటీ పడ్డారు. కాని మానవహక్కుల సంఘాలకు ఈసారి బహుమతిని ప్రకటించారు. బెలారస్ దేశానికి చెందిన ప్రముఖ మానవ హక్కుల ఉద్యమకారుడు అలెస్ బైలియాట్ స్కీతోపాటు.. హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ రష్యా, మెమోరియల్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఉక్రెయిన్, సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్ (సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్) లకు 2022 సంవత్సరానికి గాను నోబెల్ పీస్ ప్రైజ్ కు ఎంపిక చేశారు. ఈ మేరకు నార్వేజియన్ నోబెల్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. ఆయా దేశాల్లో ప్రజలకు ప్రభుత్వాలపై ప్రశ్నించే హక్కు పట్ల అవగాహన కల్పించడం, అదే విధంగా ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించడం, పౌరుల ప్రాథమిక హక్కులను పరిరక్షించడం వంటి కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తులకు, సంస్థలకు శాంతి బహుమతి బహూకరించనున్నట్లు ఈ సందర్భంగా నోబెల్ కమిటీ వివరించింది.ఈ శాంతి బహుమతి విజేతలు యుద్ధ నేరాలను నియంత్రించేందుకు కృషిచేశారని కమిటీ తెలిపింది. నేరాలను నమోదు చేయడం, మానవ హక్కుల ఉల్లంఘనలు, ప్రభుత్వాల అరాచకాలను ప్రశ్నించారని నోబెల్ కమిటీ ప్రశంసించింది. శాంతి, ప్రజాస్వామ్యం నెలకొల్పడం కోసం పాటుపడ్డారని పేర్కొంది. మానవ హక్కుల న్యాయవాది అలెస్ బిలియాట్స్కీ, రష్యన్ మానవ హక్కుల సంస్థ మెమోరియల్ మరియు ఉక్రేనియన్ మానవ హక్కుల సంస్థ సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్ 2022 నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్నాయి.

# సిఎం కెసిఆర్ పాల పిట్ట దర్శనం వివాదాస్పదం

(మొదటి పేజీ తరువాయి..) కుటుంబ సభ్యులు మొక్కుతున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో సీఎం కేసీఆర్ వివాదంలో చిక్కుకున్నారని అంటున్నారు. సెంటిమెంట్ కోసం అధికారులను రిస్క్‌లో పడేసారని ఆయనపై విమర్శలు వస్తున్నాయి. పాలపిట్టను చూడడం కోసం ముఖ్యమంత్రి ప్రగతి భవన్‌కు తెప్పించుకున్నారు. దీనిపై చాలా విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర పక్షిని పంజరంలో బంధించి తీసుకొచ్చిన ప్రభుత్వ సిబ్బందితోపాటు సీఎం చేసిన ఈ చర్యపై జంతు ప్రేమికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 ప్రకారం పాలపిట్టను బంధించడం నేరం. యాక్ట్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేకంగా వైల్డ్ లైఫ్ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అలాంటిది ముఖ్యమంత్రి తన కోసం పాలపిట్టను బంధించి తనవద్దకు తెప్పించు కోవడాన్ని జంతుప్రేమికులు వ్యతిరేకిస్తున్నారు. వన్యప్రాణుల చట్టానికి చైర్మన్‌గా ఉండి.. వాటిని రక్షించాల్సిన సీఎం నిబంధనలు ఉల్లంఘించడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. అధికార పక్షి పాలపిట్టను ఒక పంజరంలో బంధించి దసరా రోజున సీఎం కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు దర్శించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రగతి భవన్‌కు పాలపిట్టను తెప్పించుకోవడం వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్‌కు విరుద్ధమని జంతు ప్రేమికులు అంటున్నారు.

# మునుగోడు ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి..) ఉపసంహరణకు ఈ నెల 17 వరకు గడువు ఉంటుందని తెలిపింది. నవంబర్ 3న ఉపఎన్నిక పోలింగ్, 6న కౌంటింగ్ నిర్వహించనున్నారు. చండూరు తాసిల్దార్ కార్యాలయంలో నామినేషన్ల పక్రియ కొనసాగుతున్నది. శని, ఆదివారల్లో మినహా ఈ నెల 14 వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు నామపత్రాలు దాఖలు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే వ్యక్తితో కలిసి ఐదుగురికి మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని వెల్లడించారు. అయితే నామినేషన్ల మొదటి రోజే నియోజకవర్గంలో భారీ మొత్తంలో నగదు పట్టుబడింది. మునుగోడు మండలం గూడపూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు రూ.13 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. గూడపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద పోలీసులు డబ్బును గుర్తించారు. దానికి సంబంధించిన పత్రాలను అతడు చూపించకపోవడంతో అధికారులు ఆ మొత్తాన్ని సీజ్‌చేశారు.

# కాంగ్రెస్‌కు ప్రతిష్టగా మారిన మునుగోడు

## సిట్టింగ్‌స్థానం నిలుపుకునేందుకు నానా తంటాలు

**నల్లగొండ, అక్టోబర్ 7 (సమ సమాజం):** వరుస పరాజయాలతో సతమతమవుతున్న హస్తం పార్టీ.. ఈ ఉప ఎన్నికతో చావోరేవో తేల్చుకునేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న భాజపా.. మునుగోడు వేదికగా తెరాసకు తామే ప్రత్యామ్నాయమని నిరూపించాలని వ్యూహాలు పన్నుతోంది.కాంగ్రెస్ పార్టీ… సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకోవటమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. తొలి నుంచి కాంగ్రెస్‌కు కంచుకోట లాంటి నల్గొండ జిల్లాలో జరుగున్న ఈ ఉపఎన్నికలో పార్టీకి విజయం కీలకం అయినందున… అభ్యర్థి ఎంపికలోనూ గతంలో మాదిరిగా కాకుండా అందరికంటే ముందుగానే నిర్ణయం తీసుకుంది. పార్టీ తరఫున దివంగత నేత పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పాల్వాయి స్రవంతిని బరిలోకి దించింది. తాజాగా ఏర్పాటైన గట్టుప్పల్ మండలం సహా మొత్తం ఏడు మండలాల్లో సంస్థాగతంగా తమ పార్టీకి ఉన్న బలంపై నేతలు నమ్మకంగా ఉన్నారు. అభ్యర్థి పాల్వాయి స్రవంతి ఇప్పటికే 5 మండలాల్లో ఇంటింటి ప్రచారం పూర్తి చేయగా మరో రెండు మండలాలు చేయాల్సి ఉంది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిలకు ఈ ఎన్నిక కీలకం కానుంది. ఉపఎన్నికల ఊపుతో ఉన్న భాజపా రానున్న అసెంబ్లీ ఎన్నికలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని భావిస్తోంది. మునుగోడులో



విజయం సాధించి రాష్ట్రంలో తెరాసకు తామే ప్రత్యామ్నాయమన్న సంకేతాలను ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లాలని కమలదళం ఆశిస్తోంది. ఈ నియోజకవర్గంలో భాజపా గతంలో ఎప్పుడూ కనీసం రెండోస్థానంలో కూడా సాధించలేదు. 2009 నుంచి జరిగిన మూడు ఎన్నికల్లో గంగిడి మనోహర్‌రెడ్డి ఇక్కడి నుంచి భాజపా అభ్యర్థిగా పోటీచేసినా మూడో స్థానానికే పరిమితమయ్యారు. నియోజకవర్గంలో పార్టీ బలహీనంగా ఉన్నా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రూపంలో బలమైన అభ్యర్థి కానున్నారు. రాజగోపాల్ భాజపా కండువా కప్పుకునే సమయంలో పార్టీ అగ్రనేత అమిత్‌షా నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభ కమలదళంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. రాజగోపాల్‌రెడ్డి వెంట కాంగ్రెస్ ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు రావడంతో కమలదళం గెలుపు ఉత్సాహంతో ఉంది. ఆర్నెళ్లుగా సంస్థాగతంగా బలోపేతంపై భాజపా నేతలు దృష్టిసారించారు. పోలింగ్ బూత్‌లకు కమిటీలు వేశారు. ఇప్పటికే గ్రామగ్రామాన విస్తృతంగా పర్యటిస్తున్న రాజగోపాల్‌రెడ్డి… గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. మరోవైపు తెజస, ప్రజాశాంతి, బీఎస్పీలు సైతం మునుగోడు ఉపఎన్నిక బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రజాశాంతి పార్టీ తరఫున గద్దర్‌ను బరిలోకి దించుతామని ఆ పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఇప్పటికే ప్రకటించారు. ఉపఎన్నికలో తమ



అభ్యర్థులను బరిలోకి దింపుతామని తెజస, బీఎస్పీలు స్పష్టం చేశాయి.

# మునుగోడులో కెసిఆర్‌కు బుద్ధి చెబుతాం

## దమ్ముంటే అక్కడ గెలిచి చూపించాలి

## బిజెపి ఎంపి లక్ష్మణ్ సవాల్



**హైదరాబాద్, అక్టోబర్ 7 (సమ సమాజం):** మునుగోడు ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. సీఎం కేసీఆర్‌కి దమ్ముంటే మునుగోడు ఎన్నికల్లో గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. రాజేంద్ర సర్కిల్ మహవీర్ కాలేజీలో తెలంగాణ భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా 3రోజుల శిక్షణా శిబిరం, రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ లక్ష్మణ్, పార్టీనేత మురళీధర్ రావులు పాల్గొన్నారు. ఉద్యమకారాలను తెలంగాణ ప్రభుత్వం మోసం చేసిందని చెప్పారు. రాష్ట్రంలో బీసీలకు సముచిత స్థానం లభించలేదని లక్ష్మణ్ ఆరోపించారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు బీసీలను మోసం చేశాయని ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు.ప్రధాని నరేంద్ర మోడీ బీసీలకు సముచిత స్థానం ఇచ్చి వారికి ఉన్నత పదవులతోపాటు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ ఫ్యామిలీ అప్పుల తెలంగాణగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పాలనపై ప్రజల అసంతృప్తితో ఉన్నారని,రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చిన బీజేపీ అఖండ మెజారిటీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఓబీసీ మోర్చా నేతలందరూ కలిసి ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కోరారు.




# చలన చిత్రం



## దసరా సినిమాపైనూ నాని ఆశలు

నేచురల్ స్టార్ నాని బాక్సాఫీస్ వద్ద మంచి సక్సెస్ అందుకుని అయితే చాలాకాలం అయింది. డిఫరెంట్ సినిమాలు ట్రై చేస్తున్నా .. బాక్సాఫీస్ వద్ద మళ్ళీ రికార్డు స్థాయిలో అయితే విజయం దక్కడం లేదు. చివరగా నటించినా అంటే సుందరానికి సినిమా చాలా చోట్ల నష్టాలను మిగిల్చింది. అంతకంటే ముందు వచ్చిన శ్యామ్ సింగరాయ్ మాత్రం పరవాలేదు అనిపించే విధంగా పెట్టిన పెట్టుబడిన వెనక్కి తెచ్చింది. అయితే ఆ రెండు సినిమాల ఫలితాలపై నాని అయితే సంతృప్తిగా లేడు. ఇక ప్రస్తుతం అతని నమ్మకం మొత్తం కూడా దసరా సినిమాపైనే ఉంది. కొత్తదర్శకుడు శ్రీకాంత్ ఓదెలా దర్శకత్వంలో తెరపైకి తీసుకు వస్తున్న దసరా సినిమాకు సంబంధించిన షూటింగ్ అయితే శరవేగంగా జరుగుతోంది. అయితే ఈ సినిమా బడ్జెట్ కారణాల వలన మధ్యలో ఆగిపోవచ్చు అని టాక్ కూడా వచ్చింది. అంతేకాకుండా దీన్ని మరొక నిర్మాత ఆధీనంలోకి తీసుకున్నాడు అని కూడా వార్తలొచ్చాయి. అయితే నిర్మాత చెరుకూరి సుధాకర్ మాత్రం అందులో ఎలాంటి నిజం లేదని ఒక క్లారిటీ అయితే ఇచ్చారు. ఇక ఆయన ఇటీవల విరాటపర్వం రామారావు ఆన్ డ్యూటీ సినిమాలతో ఊహించిన విధంగా డిజాస్టర్స్ అందుకున్నప్పటికీ కూడా ఈ సినిమాను 50 కోట్ల పెట్టుబడి తో తెరపైకి తీసుకువస్తున్నారు. అయితే ఈ సినిమాకు విడుదలకు ముందే మంచి డీల్స్ అయితే సెట్ అయినట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా ఓటీటీ హక్కుల ద్వారానే ఈ సినిమాకు దాదాపు 30 కోట్ల వరకు వచ్చినట్లు సమాచారం. దసరా సినిమాను పాన్ ఇండియా లెవెల్లో మిగతా భాషల్లో కూడా విడుదల చేయబోతున్నారు. అయితే మిగతా భాషలో ఈ సినిమా దాదాపు పది కోట్ల వరకు బిజినెస్ చేసే అవకాశం ఉంది. ఇక శాటిలైట్ పరంగా మరో 20 కోట్లు రావచ్చు అని తెలుస్తోంది. ఇలా మొత్తంగా చూసుకుంటే దసరా సినిమా నాన్ థియేట్రికల్ గానే 60 కోట్ల వరకు బిజినెస్ చేసినట్లు తెలుస్తోంది. అంటే దాదాపు నిర్మాత పెట్టిన పెట్టుబడి వెనక్కి వచ్చినట్లే అనిపిస్తోంది. ఇక థియేట్రికల్ గా చూసుకుంటే ఈ సినిమా రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా దాదాపు 40 కోట్ల వరకు ఫ్రీ రిలీజ్ బిజినెస్ చేయవచ్చు అని సమాచారం. అంటే మొత్తంగా దసరా సినిమా 100 కోట్ల బిజినెస్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. కాబట్టి ఈ సినిమా నాని కెరీర్ కు చాలా ముఖ్యం కాబోతోంది. మరి బాక్స్ ఆఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.



## మాల్దీవ్స్‌కు చెక్కేసిన స్టార్ జంట

సినీ తారలకు ఏమాత్రం గ్యాప్ వచ్చినా కూడా హాలిడేస్ ఎంజాయ్ చేయడానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. రోజులతరబడి షూటింగ్స్‌లో అలసిపోతూ... కొన్నిసార్లు తీవ్రస్థాయిలో అసంతృప్తితో ఉంటారు. ఒక విధంగా యాక్టింగ్ చేయడం అనేది చాలామందికి కష్టంగానే భావించాలి. ముఖ్యంగా హీరో హీరోయిన్స్ అయితే పలుమార్లు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇక ఆ ప్రెజర్ అంతా తీర్చుకోవడానికి వారు కొంతకాలం గ్యాప్ కూడా తీసుకుంటూ ఉంటారు. ఇటీవల కాలంలో విశ్రాంతి కోసం మాల్దీవ్స్ వెళుతున్నారు. ఇప్పుడు మరో ఇద్దరు స్టార్ సెలబ్రిటీలు కూడా అక్కడికి వెళ్లారు. ముందుగా ఎవరు వెళ్లారో తెలియదు కానీ ప్రస్తుతం అయితే సోషల్ మీడియాలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలకు సంబంధించిన ఫోటోలు అయితే వైరల్ గా మారుతున్నాయి. ఎయిర్ పోర్ట్ లో ఒకే రోజు కనిపించడం వైరల్ గా మారింది. వీరిద్దరూ ఇదివరకే గీతా గోవిందం డియర్ కామ్రేడ్ సినిమాలలో నటించిన విషయం తెలిసిందే. ఆ రెండు సినిమాలతోనే భారీ స్థాయిలో క్రేజ్ అందుకున్న ఈ జోడి పై మధ్యలో చాలా రకాల రూమర్లు అయితే వచ్చాయి. కానీ అందులో ఎలాంటి నిజం లేదని ఆ తర్వాత వీళ్ళు వార్తలను కొట్టి పారేశారు. ఇక రీసెంట్‌గా రష్మిక మందన గుడ్ బై సినిమా ప్రమోషన్లు పాల్గొన్న తర్వాత మళ్లీ వెంటనే మాల్దీవ్స్ కు వెళ్ళాలి అని డిసైడ్ అయింది. ఆమెకు సంబంధించిన ఫోటో ఒకటి కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇక మొన్నటి వరకు విజయ్ దేవరకొండ లైగర్ సినిమాతో చాలా బిజీగా కనిపించాడు. ఆ సినిమా ఫ్లాప్ కావడంతో అతను చాలా వరకు ఫ్యామిలీతోనే ఇంట్లోనే ఉన్నాడు. అలాగే ఖుషి సినిమాకు సంబంధించిన ఒక షెడ్యూల్ కూడా పూర్తయింది. ఇక మరొక షెడ్యూల్ మొదలవడానికి కొంత సమయం ఉంది కాబట్టే విజయ్ దేవరకొండ ఈ గ్యాప్ లో గ్యాప్ తీసుకొని మాల్దీవ్స్‌కు వెళ్ళాడని అంటున్నారు.



## ఖుష్బూ ఆరోగ్యంపై ఆందోళన

సినీ నటి, రాష్ట్ర బీజేపీ మహిళా నేత ఖుష్బు సుందర్ మళ్ళీ ఆస్పత్రి పాలయ్యారు. ఇటీవల ఆమె తన బరువును గణనీయంగా తగ్గించుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆమె తరచూ అనారోగ్యం పాలవుతున్నారు. మంగళవారం చెన్నై నగరంలో జరిగిన తన సోదరుడు అబ్దుల్లా నటించిన సినిమా ఆడియో రిలీజ్ వేడుకలో పాల్గొన్నారు. ఆ రోజు ఎంతో హుషారుగా కనిపించిన ఆమె సాయంత్రానికి అస్వస్థతకు లోనై నగరంలోని అపోలో ఆస్పత్రిలో చేరారు. ఈ విషయాన్ని ఆమె తన ట్విట్టర్ ఖాతాలో వెల్లడించారు. 'వెన్నెముక సమస్య కారణంగా ఆస్పత్రిలో చేరాను. ఒకటి రెండు రోజుల్లో మళ్ళీ రోజువారీ విధుల్లో పాలుపంచుకుంటాను' అని ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఆమె హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయినట్లుగా తెలుస్తోంది. ఇక ఖుష్బు చేసిన ట్వీట్ చూసిన తర్వాత ఆమె అభిమానులు.. ఒక్కసారిగా.. 'ఏమైంది మీకు.. గెట్ వెల్ సూన్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అభిమానులే కాదు.. గవర్నర్ తమిళ్ సై, మీనా, రాధ, అతిథి వంటి వారందరూ ట్విట్టర్ వేదికగా.. ఆమె త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లుగా ట్వీట్ చేశారు. ఇలా వచ్చిన ప్రతి ట్వీట్‌కు ఖుష్బు సుందర్ 'థ్యాంక్యూ' అంటూ రిప్లయ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆమె పూర్తి స్థాయిలో కోలుకున్నట్లుగా సమాచారం.






## 4న విడుదల కానున్న ఊర్వశివో రాక్షసివో

### రొమాన్సీన్స్ అదుర్స్ అంటున్న మేకర్స్

౦౦

అల్లు శిరీష్, అను ఇమ్మాన్యుయేల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఊర్వశివో రాక్షసివో' చిత్రాన్ని నవంబర్ 4వ తేదీన విడుదల కానుంది. అయితే ముందు ప్రకటించిన 'ప్రేమకాదంట' టైటిల్‌ను మార్చి 'ఊర్వశివో రాక్షసివో' అంటూ ఇటీవల మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఈ సినిమాకు సంబంధించిన వదిలిన టీజర్.. అందులో ఉన్న కంటెంట్‌తో ఒక్కసారిగా అందరూ ఈ సినిమా గురించి మాట్లాడుకునేలా చేసింది. ముఖ్యంగా శిరీష్, అనుల మధ్య రొమాంటిక్ సీన్స్..యూత్‌ని బాగా ఆకర్షించాయి. చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈలోపు సాధ్యమైనంతగా చిత్రాన్ని ప్రేక్షకులలోకి తీసుకెళ్లేందుకు మేకర్స్ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా.. ముందుగా ఓ లవ్లీ మెలోడీ సాంగ్‌ని విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఈ సాంగ్ ప్రోమోని మేకర్స్ విడుదల చేశారు. ఈ ప్రోమో సినిమాపై మరింతగా అంచనాలను క్రియేట్ చేయడమే కాకుండా.. అల్లు శిరీష్ ఈ సినిమాతో ఏదో మ్యాజిక్ చేసేలానే ఉన్నాడనేలా మాట్లాడుకునేలా చేస్తోంది. సాంగ్ విషయానికి వస్తే.. టాప్ సింగర్ సిడ్ శ్రీరామ్ స్వరంతో'అనగా అనగనగా, కనులే కలగనగా, ఃజమై మెరుపల్లే వాలేగా,నా ఊపిరి నడక.. తన ఊపిరి జతగాకలగలిసి మొదలై నాలో అలజడిగా' అనే సాహిత్యంతో మొదలైన ఈ పాట మంచి ఫీల్‌ను క్రియేట్ చేస్తుంది. ఈ పాటలో కూడా అల్లు శిరీష్, అను ఇమ్మాన్యుయేల్‌ల కెమిస్ట్రీ.. మరోసారి ఈ సినిమాని వార్తలలో నిలిచేలా చేస్తున్నాయి. ఈ పాటను అచ్చు రాజమణి స్వరపరచగా.. పూర్ణాచారి సాహిత్యం అందించారు. సిద్ శ్రీరామ్ వాయిస్‌లో ఈ పాట వినసొంపుగా ఉంది. ఈ లవ్లీ మెలోడీ ఫుల్ సాంగ్‌ను అక్టోబర్ 10న విడుదల చేయబోతున్నట్లుగా మేకర్స్ తెలిపారు. కాగా, అల్లు అరవింద్ సమర్పణలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని ఉం2 పిక్చర్స్‌పై ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. విజయ్ ఎం సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'విజేత' సినిమా దర్శకుడు రాకేష్ శశిదర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో వుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in